క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అనురాధ నామినేషన్ నేడు



దేవరాపల్లి: వైఎస్సార్ సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ గురువారం నామినేషన్ వేయనున్నారు. తారువ నుంచి ఉదయం 9 గంటలకు భారీ ర్యాలీగా బయలుదేరి మాడుగుల చేరుకుంటారు. మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ మండలాల నుంచి బైక్‌లు, ఆటోలు, కార్లు తదితర వాహనాలలో వేలాదిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు, మహిళలు భారీ ర్యాలీగా ఘాట్ రోడ్డు జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి అనురాధ కాలినడకన మాడుగుల చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తారు. దేవరాపల్లి మండలం నుంచి 10 వేల మంది వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు, మహిళలు తరలివెళ్లనున్నట్లు జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు.
కె.కోటపాడు మండలంలో 32 పంచాయతీల నుంచి 10 వేల మంది ర్యాలీగా తరలివెళ్లనున్నట్లు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు.

మజ్జిగ, పులిహోర పంపిణీ



పులిహోర, మజ్జిగ పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామంలో బుధవారం సత్యసాయి ట్రస్టు సభ్యులు మజ్జిగ, పులిహోర పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక బస్‌స్టేషన్ వద్ద వీటిని ఏర్పాటు చేసి వచ్చిన ప్రతీ ప్రయాణికుడికి అందించారు. సత్యసాయి ఆరాధనోత్సవం సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ట్రస్టు సభ్యులు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

అవంతిలో పాలిటెక్నిక్ మాక్ గ్రాండ్ టెస్ట్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మాక్ గ్రాండ్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టుకు 123 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ మోహన్‌రావు బుధవారం తెలిపారు. పోటీ పరీక్షలపై విద్యార్థుల్లో భయాందోళన తొలగించేందుకు మాక్‌గ్రాండ్ టెస్ట్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సుపై అవగాహన కల్పించామన్నారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం



గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

నాతవరం: గ్రామాలు అభివృద్ధి చెందడానికి పంచాయతీ రాజ్ శాఖ చట్టం కీలకమని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ రాజ్ చట్టం విధి విధానాలు, హక్కులు, పంచాయతీల అభివృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.వి.ఎస్.మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పాంజలి

కశింకోట: స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పుష్పాంజలి సేవను ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవం ముగింపులో భాగంగా స్వామి వారిని పూలతో అందంగా అలంకరించి పలు రకాల స్వీట్లు, పాలు, పండ్లు, ఇతర పిండి వంటకాలను నివేదించారు.

చోడవరం.. జనసంద్రం

- అభిమానుల కోలాహలం మధ్య ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ నామినేషన్
- పార్టీ శ్రేణులతో భారీ వాహన ర్యాలీ
- పాల్గొన్న ఎంపీ అభ్యర్థి బూడి, పార్టీ నాయకులు



చోడవరం పట్టణంలో వైఎస్సార్‌సీపీ అభిమానులతో నిండిపోయిన రోడ్లు



చోడవరం ధర్మశ్రీ నామినేషన్ ర్యాలీలో మాట్లాడుతున్న ముత్యాలనాయుడు

చోడవరం: నేల ఈనిందా...అన్నట్టుగా చోడవరం పట్టణం జనసంద్రమైంది. ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ అభిమానుల కోలాహలం నెలకొంది. మెయిన్‌రోడ్డు పొడవునా జనం కిక్కిరిసింది. జై జగన్...జై ధర్మశ్రీ అంటూ నినాదాలతో అంతా హోరెత్తిపోయింది. గ్రామాల నుంచి వాహనాల్లో బయలుదేరిన కార్యకర్తల సందడితో నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ఒక పండగ వాతావరణం చోటుచేసుకుంది. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానుల మధ్య వైఎస్సార్‌సీపీ చోడవరం అసెంబ్లీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బుధవారం నామినేషన్ వేశారు. సుమారు 25 వేలకు పైబడి కార్యకర్తలు అభిమానులు ఈ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. చోడవరం గాంధీగ్రామం హైస్కూల్ దగ్గర నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఒక పక్క తీన్‌మార్ డబ్బుల మోతలు, మరో పక్క వివిధ కళాకారుల నృత్య ప్రదర్శనలు, కోలాటకం భజనలు, వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార పాటలతో డీజే మైక్‌ల మోతలతో నామినేషన్ కార్యక్రమం ఎంతో సందడిగా జరిగింది.

ప్రజల పక్షాన నిలబడిన పార్టీ వైఎస్సార్‌సీపీ : ఎంపీ అభ్యర్థి బూడి

ఓపెన్ టాప్ ప్రచార వాహనంపై ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ప్రజలకు అభివాదం చేశారు. ర్యాలీ ప్రారంభంలో ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడిన పార్టీ ఏదైనా ఉందంటే, అది ఒక్క వైఎస్సార్‌సీపీయేనని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు మరి కొంత కాలం ప్రజలకు పూర్తిగా అందాలంటే వైఎస్సార్‌సీపీ గెలిపించాలని కోరారు. వ్యాపారాల కోసం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కడప వ్యక్తికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ప్రజల కోసం ఒక అజెండా లేని బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓపెన్‌టాప్ వాహనంపై ధర్మశ్రీ, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు శరగడం చిన ప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే గూనూరు మిలట్రీనాయుడు ప్రజలకు అభివాదం చేస్తూ ఊరేగిపుంగా వచ్చారు. మెయిన్‌రోడ్డుపై పాత బస్టాండ్, వినాయకుడు గుడి, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా కొత్తూరు జంక్షన్ వరకూ ఊరేగింపు నిర్వహించారు. అడుగడునా జనం పూల వర్షం కురిపించారు. గిరా గిరా తిరుగుతోంది ఫ్యాన్ అంటూ మహిళలు, యువకులు అంతా డ్యాన్స్ వేశారు. క్రేన్ల సాయంతో భారీ గజమాలలు అడుగడునా ధర్మశ్రీకి వేసి స్వాగతం పలికారు.

పదేళ్ల టీడీపీ పదవిలో ఏం చేశారు: ఎమ్మెల్యే ధర్మశ్రీ..

కొత్తూరు జంక్షన్ వద్ద ప్రజలను ఉద్దేశించి ధర్మశ్రీ మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గ అభివృద్ధి జరిగిందంటే అది వైఎస్సార్‌సీపీ హయాంలోనే నని అన్నారు. నియోజకవర్గంలో అన్ని రోడ్లు వేశామని, మంచినీటి, స్థానిక సమస్యలు పూర్తిగా పరిష్కరించామన్నారు. ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఆయనను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందిరిపై ఉందన్నారు. స్థానిక టీడీపీ నాయకులు పదేళ్లు అధికారంలో ఉండి ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసునన్నారు. అభివృద్ధి అంటే ఏంటో తాను చేసి చూపించానన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాయని, ప్రజలంతా అప్రమతంగా ఉండి వచ్చే ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీని గెలిపించి, ప్రజా ప్రభుత్వాన్ని తిరిగి తెచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు శరగడం చినప్పలనాయుడు మాట్లాడూ జనం కోసం పనిచేసే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరలా గెలుపించుకోవాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ధర్మశ్రీ, ముత్యాలనాయుడు గెలిపించాలన్నారు. చోడవరం నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ జన సంద్రం చూస్తే త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలుస్తుందనటానికి ఎటువంటి సందేహం లేదని చినప్పలనాయుడు అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి నామినేషన్ వేసేందుకు ధర్మశ్రీ వెళ్లారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుంచి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వేలాదిగా పాల్గొన్నారు. అనకాపల్లి డీఎస్పీ లోవరాజు పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.



చోడవరం ధర్మశ్రీ నామినేషన్ కార్యక్రమంలో హుషారుగా మహిళల కోలాటం

మరో అవకాశం ఇవ్వండి.. మరింత అభివృద్ధి చేస్తా



కరపత్రం అందజేసి ఓటు వేయమని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గణేష్

- ఎన్నికల ప్రచారంలో నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని 24, 10 వార్డుల్లో పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, వార్డు ఇన్‌చార్జి, పార్టీ పట్టణాధ్యక్షులు ఏకా శివకుమార్, చీటిల రాము, పార్టీ శ్రేణులతో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న మంజూరు చేసిన సంక్షేమ పథకాలు, పట్టణంలో చేసిన అభివృద్ధిని వివరించారు. మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో చంద్రబాబు హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. దీంతో ప్రజాదరణ కోల్పోయిన టీడీపీ ఓటమి భయంతో బీజేపీ, జనసేన పార్టీలతో జత కట్టిందన్నారు. ఇవి కుట్రలు పన్నుతూ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకునేందుకు వస్తున్నాయని, కూటమి నాయకులను నమ్మి మళ్లీ మోసపోవద్దని సూచించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగనన్నను మరోసారి సీఎం చేయాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని విన్నవించారు. మేనిఫెస్టోను విడుదల చేసిన వెంటనే ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న హామీలు గురించి వివరిస్తామన్నారు. 30 వేల మెజార్టీతో రెండోసారి తాను ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపాలిటీ యూత్ నాయకుడు ధనిమిరెడ్డి ప్రసాద్, నూకాంబిక దేవస్థానం చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, పార్టీ సీనియర్ నాయకులు ఏకా రాజుబాబు, కర్రి రామ్‌గోపాల్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జి.ఆదిలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే గణేష్ ఎన్నికల ప్రచారం

నాతవరం: మండలంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ గురువారం ఎన్నికలు ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు తెలిపారు. ముందుగా పి.జగ్గంపేటలో ప్రారంభమై పి.కె.గూడెం, గునుపూడి, ఎస్.బి.పట్నం, చినగొలుగొండపేట, పెద గొలుగొండపేట, వెదురుపల్లి, గుమ్మడిగొండ, కె.ధర్మవరం, చమ్మచింత గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం చేస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

విజయరామరాజుపేట, పీపీ అగ్రహారం వలంటీర్ల రాజీనామా



విధులకు రాజీనామా చేసిన విజయరామరాజుపేట వలంటీర్లు



పీపీ అగ్రహారంలో రాజీనామా పత్రాలను అధికారులకు అందిస్తున్న వలంటీర్లు

బుచ్చెయ్యపేట: మండలంలో విజయరామరాజుపేట, పీపీ అగ్రహారం గ్రామాల వలంటీర్లు తమ బాధ్యతలకు బుధవారం రాజీనామా చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేరవేస్తున్న తమను టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అగౌరవపరచడాన్ని నిరసిస్తూ తమ విధుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నట్లు రెండు గ్రామాల వలంటీర్లు తెలిపారు. రాజీనామా పత్రాలను గ్రామ సెక్రటరీల ద్వారా ఎంపీడీవో వెంకటాచార్యకు అందించారు. ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం జగనన్నను రెండోసారి గెలుపు కోసం పాటు పడతామన్నారు.

బుచ్చెయ్యపేటలో ఈదురుగాలుల బీభత్సం



దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం



బుచ్చెయ్యపేటలో ఈదురుగాలులకు ఊగుతున్న చెట్లు

బుచ్చెయ్యపేట: మండలంలో బుధవారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండకాసింది. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో చెట్లు నెలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. గంటికొర్లాం, బుదిరెడ్లపాలెం, పోలేపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మామిడికాయలు నేల రాలడంతో మామిడి రైతులకు నష్టం వాటిల్లింది. అరటి, చెరకు, సరుగుడు తదితర తోటలు నేలకొరిగాయి. రాత్రి పది గంటల వరకూ పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. మరోవైపు చిరుజల్లులతో వర్షం కురిసినా ఉక్కపోత తగ్గకపోవడంతో మండల ప్రజలు అల్లాడిపోయారు.



సీతంపేటలో నేలమట్టమైన అరటితోట

జిల్లా ద్వితీయ స్థానం విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

చోడవరం రూరల్: పదో తరగతి తెలుగు మీడియంలో అనకాపల్లి జిల్లా స్థాయిలో 575 మార్కులను సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థిని జిల్లా విద్యాశాఖాధికారులు అభినందించారు. గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన ఎస్.రామకృష్ణకు జిల్లా విద్యాధికారి వెంకటలక్ష్మమ్మ, ఏడీ రవిబాబు, ఏపీవో వెంకటేశ్వర్లు జ్ఞాపికను అందచేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.జె. సుందర్‌సింగ్, ఉపాధ్యాయిని ఎ.ఎస్.కృప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల ఆలయ ప్రారంభోత్సవం



ఎంపీ అభ్యర్థి బూడిని ఆశీర్వదిస్తున్న ఉమామహేశ్వరశర్మ

కె.కోటపాడు: యడ్లవానిపాలెంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ, శిఖర ప్రతిష్ట అనంతరం సీతారాముల దర్శనభాగ్యాన్ని భక్తులకు కల్పించారు. సీతారాములను అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమామహేశ్వరశర్మ నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన బూడిని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు యడ్ల ముత్యాలనాయుడు(సీసీ), గనివాడ సత్యం, సర్పంచ్ గొంద్రుపోటు సౌజన్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొంద్రుపోటు వెంకటరావు, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, లెక్కల గోపి, బొడ్డు దొరస్వామినాయుడు(లాయర్), దొగ్గ శివ, యడ్ల వెంకునాయుడు, యడ్ల సన్నిబాబు, సత్యం, యడ్ల రామునాయుడు పాల్గొన్నారు.

జగనన్న గెలుపు చారిత్రక అవసరం

- కూటమి మాయ మాటలను నమ్మొద్దు
- చౌడువాడ, మల్లంపాలెం, దాలివలస గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ ఎన్నికల ప్రచారం



సీఎం జగన్ వస్తేనే దివ్యాంగులకు మేలని చెబుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



దాలివలసలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



చౌడువాడ నుంచి మల్లంపాలెంలో ఓటర్లను కలిసేందుకు బైక్ నడుపుతూ వెళ్తున్న అనురాధ

కె.కోటపాడు: కులం, మతం, పార్టీలు తేడా లేకుండా రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారని వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. మండలంలో చౌడువాడ, మల్లంపాలెం, దాలివలస గ్రామాల్లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆమె స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ ఓటర్లను మండుటెండలో కలిశారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన అనురాధను ఆయా గ్రామాల్లో మహిళలు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల సమయంలో మాయ మాటలను చెప్పి మోసం చేసేందుకు కూటమిగా ప్రజల ముందుకు వస్తున్నారని, వారిని నమ్మొద్దని కోరారు. 2014లో చంద్రబాబు నెగ్గి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. మరలా ఇప్పుడు అమలు కాని హామీలతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు వస్తున్నారన్నారు. సీఎం జగన్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రజలకు ఇప్పుడు అందుతున్న సంక్షేమం కొనసాగుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో లంచం లేని సేవలు అందుబాటులోకి తెచ్చారన్నారు. 58 నెలలుగా పింఛన్‌దారుల ఇంటికే పింఛన్ సొమ్ము పంపించారన్నారు. చంద్రబాబు నిర్వాకంతో ఈ నెల పింఛన్ నగదును పంచాయతీ కార్యాలయాల్లో ఇబ్బందులు పడి తీసుకోవాల్సి వచ్చిందన్నారు. కోర్టులో కేసులు వేయించి వలంటీర్ల సేవలను నిలిపివేయించారని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపిస్తే ఐదేళ్ల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో తోడుంటానని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీ రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆకుల సాయిప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, సచివాలయ కన్వీనర్ వారాధి అప్పారావు, దాలివలస సర్పంచ్ భూమిరెడ్డి దేముళ్లు, మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు, ఆర్బీకే కన్వీనర్ రొంగలి సుందరరావు, వార్డు మెంబర్లు చల్లా సురేష్, వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, బొడ్డు దేముడుబాబు, కండిపల్లి కృష్ణారావు, పచ్చికూర సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చర్యలు


- ఎన్నికల అసిస్టెంట్ అధికారి నరేంద్ర



వాహనాలను తనిఖీ చేస్తున్న తనిఖీ చేస్తున్న అధికారులు

రోలుగుంట: ఎన్నికల కోడు అమలును అనుసరిస్తూ వడ్డాది–నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డులో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మండల సరిహద్దు నిండుగొండ కూడలి వద్ద ఎన్నికల సహాయాధికారి కె.నరేంద్ర తన బృందంతో బుధవారం ఈ మార్గంలో వాహనాలను ఆపి నిశితంగా శోధిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఏమైనా నగదు కాని, దుస్తులు కాని మరేవిధమైన వస్తు రూపేణా తరలించే వాటిని అరికట్టేందుకు గాను ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనాల రవాణాకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సహాయాధికారి మాట్లాడుతూ రూ.50 వేలకు మించి తరలిస్తే, ఆధారాలు ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలు ఉంటాయన్నారు. చోడవరం ఏఎస్సై డి.ఎస్.ఎం. కుమారి, కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో కవలల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన రియాన, రిషిత

అనకాపల్లి : పదో తరగతి పరీక్షల ఫలితాల్లో స్థానిక ఉమ్మలాడకు చెందిన కవల విద్యార్థులు ప్రతిభ చూపారు. పూడిమడక రహదారిలోని ప్రైవేట్ పాఠశాలలో చదివిన పల్లా రియానా 578 మార్కులు సాధించి స్కూల్‌లో ద్వితీయస్థానంలో, రిషితా 574 మార్కులు సాధించి రిషిత 4వ స్థానంలో నిలిచారు. వీరిని హైస్కూల్ కరస్పాండెంట్ బుధవారం సత్కరించారు.

మాడుగుల అసెంబ్లీకి 6 నామినేషన్లు

మాడుగుల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మాడుగుల నియోజకవర్గ స్థానానికి ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్వో జి.వి.సత్యవాణి బుధవారం తెలిపారు. టీడీపీ డమ్మీ అభ్యర్థిగా బండారు మాధవీలత, ఇండిపెండెంట్లుగా పైలా ప్రసాదరావు, మాతల ఆరినాయుడు, మల్లారపు లోవ, బి. రవి కుమార్ రెండు సెట్లు వేశారన్నారు.

చోడవరంలో 4 నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న సీపీఐ లిబరేషన్ పార్టీ అభ్యర్థి గణేష్



మాడుగుల స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ అందజేస్తున్న పైలా ప్రసాదరావు

చోడవరం: అభిమానుల కోలాహలం మధ్య వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ బుధవారం రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. డమ్మీ అభ్యర్థిగా ధర్మశ్రీ సతీమణి వెంకట విజయ లక్ష్మి నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి జగతా శ్రీనువాసరావు, సీపీఐ ఎంఎల్ లిబిరేషన్ పార్టీ నుంచి సవరాల గణేష్ నామినేషన్లు వేశారు. తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణకు అందజేశారు. ఏడో రోజున నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేయగా, ఇప్పటి వరకూ ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారంతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుండటంతో పోటీ చేసే పలువురు అభ్యర్థులు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

పూర్వ విద్యార్థి మృతికి సంతాపం

కొయ్యూరు: స్థానిక ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థి పి.శ్రీను ఊపిరితిత్తుల సమస్యతో బుధవారం మృతి చెందారు. సహచర విద్యార్థులు సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.30వేలను అందజేసి, ఓదార్చారు.